ప్రజాశక్తి
మంగళవారం 5 డిసెంబర్ 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు





# మిచౌంగ్ ముప్పు

- నేడు నిజాంపట్నం వద్ద తీరం దాటే అవకాశం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో భారీ వర్షాలు
- ఎడతెరిపిలేని వానతో జనజీవనానికి అసౌకర్యం



తెనాలి ఐతానగర్ వద్ద నేలవాలిన వరిపైరు



దుగ్గిరాల మండలంలో నేలవాలిన వరిపైరు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బంగాళఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో సోమవారం తెల్లవారుజాము నుంచి అర్థరాత్రి వరకు గుంటూరు పల్నాడు జిల్లాల్లో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. లోతట్లు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చలిగాలులు పెరిగాయి. వృద్దులు, పిల్లలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మిచౌంగ్ తుపాను తీవ్రత వల్ల ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం కురిసినట్టు అధికారులు తెలిపారు. నిజాంపట్నం హార్బర్‌లో సోమవారం 10వ నంబరు ప్రమాద సూచికను ఎగురవేశారు. మొత్తం 11 ప్రమాద హెచ్చరికలు ఉండగా 10 నంబరు ఎగురవేయడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాపై తుపాను తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

బాపట్ల-మచిలీపట్నం మధ్య నిజాంపట్నం సమీపంలో తీరం దాటనుంది. ఉమ్మడి జిల్లాలో అతి దగ్గరగా ఉన్న నిజాంపట్నం వద్ద తీరం తాకితే తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం 110 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అధికారులు అంచనా వేశారు. కావలికి సమీపంలో ఉన్న తుపాను గంటకు 10 కిలో మీటర్ల వేగంతో కదిలి మంగళవారం ఉదయం కల్లా నిజాంపట్నం వద్ద తీరం దాటే అవకాశం ఉండటంతో .జిల్లాకు ఎక్కువగా నష్టం ఉంటుందని చెబుతున్నారు. ఈ తుపాను తీవ్రత వల్ల తెనాలి డివిజన్‌లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిసింది.

ఇప్పటికే జిల్లాలోని డెల్టా ప్రాంతంలో వరి పనలపై ఉన్న పంటకు తీవ్ర నష్టం జరిగింది. వరి పంట తడిసిపోయింది. గాలి తీవ్రత వల్ల తెనాలి, పొన్నూరు, మంగళగిరి నియోజకవర్గాలోని గ్రామాల్లో వరి పైరు నేలవాలింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పొలాల్లో నీరు చేరుతుండటంతో నీటిని బయటకు పంపేందుకు రైతులు శ్రమిస్తున్నారు. మంగళవారం కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ముంపు సమస్యను బయట పడేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా వరి కోతలకు సిద్ధంగా ఉన్న ప్రాంతాల్లో కంకులు నేలవాలితే నీటిలో మునిగి మొలకెత్తే ఉండటం వల్ల రైతులు నానా తిప్పలు పడుతున్నారు. పొన్నూరు, చేబ్రోలు, తెనాలి, కొల్లిపర, పెదకాకాని,



తాడికొండ ప్రాంతంలో హడావుడిగా వరికుప్పలు వేస్తున్న కూలీలు

▶ 2లో



# రాజధాని రైతులకు ఊరట

- అమరావతి మాస్టర్ ప్లాన్‌ను ఆమోదించాం
- మూడు రాజధానుల ప్రస్తావన లేదు
- పార్లమెంటులో కేంద్రం ప్రకటన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

నాలుగేళ్లుగా ఉదమిస్తున్న అమరావతి రైతులకు భారీ ఊరట లభించింది. అమరావతి ఏకైక రాజధానిగా గుర్తించామని, మూడు రాజధానుల ప్రతిపాదనకు తమ ఆమోదం లేదని కేంద్రం సోమవారం రాజ్యసభలో ప్రకటించింది. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగానే అమరావతి మాస్టర్‌ప్లాన్‌కు కూడా ఆమోదం తెలిపామని ఇందులో ఎటువంటి మార్పులూ లేవని పేర్కొంది. ఈ ప్రకటనతో అమరావతి రైతుల్లో ఆనందోత్సవాలు వ్యక్తమయ్యాయి.

దేశంలోని 26 రాష్ట్రాలకు రాజధానుల జాబితాను విడుదల చేయగా ఇందులో ఎపికి అమరావతినే రాజధానిగా గుర్తించింది. 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ఎంపిక చేస్తూ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఎ)ను ఏర్పాటు చేసింది. సిఆర్‌డిఎ ద్వారా రాజధాని నిర్మాణం కోసం 34 వేల ఎకరాల భూమిని సమీకరించింది. భూ సమీకరణ విధానం ద్వారా రైతుల నుంచి తీసుకున్న భూములకు ప్రతిగా గృహ అవసరాల, వాణిజ్య అవసరాల వినియోగం నిమిత్తం రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చేలా రైతులతో సిఆర్‌డిఎ ఒప్పందం చేసుకుంది. మొత్తం 34 వేల ఎకరాల భూమికి 54 వేల రిటర్నబుల్ ప్లాట్లును ఏర్పాటు చేస్తూ రాజధాని గ్రామాల్లో లేఅవుట్‌లను ఏర్పాటు చేసింది. వీటిని మూడేళ్లలో అభివృద్ధి చేసి ఇస్తామని అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రకటించింది. 2019లోగా రిటర్నబుల్ ప్లాట్లను రైతులకు అప్పగించకుండానే టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయింది. 2019లో అధికారంలోకి వచ్చిన

▶ 2లో



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఇతర నాయకులు

## 17న గుంటూరులో రాష్ట్ర స్థాయి సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

సిఐటియు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పర్సా సత్యనారాయణ శతజయంతుత్సవాల్లో భాగంగా డిసెంబర్ 17న 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు-కార్మికులు, ఉద్యోగులపై ప్రభావం' అంశంపై గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి సెమినార్‌ను జయప్రదం చేయాలని సెమినార్ నిర్వాహక కమిటీ గౌరవాధ్యక్షులు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బ్రాడీపేట సిఐటియు నగర కార్యాలయంలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించి విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ఉద్యోగులు, కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కార్మిక చట్టాల్లో మార్పు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు జరపకపోవడం వంటి వాటితో తీవ్ర వ్యతిరేకత ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో 17న ఉదయం 10 గంటలకు గుంటూరు ఎన్జీవో కళ్యాణ మండపంలో జరిగే రాష్ట్రస్థాయి సెమినార్‌లో గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరావు, కార్యదర్శి దయా రమాదేవి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

▶ 2లో

## డెంటల్ విద్యార్థిని హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

పెళ్లికి నిరాకరించిందనే కక్షతో యువతిని కత్తితో పొడిచి హత్య చేసిన కేసులో కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం, మణికొండకు చెందిన మన్నే జ్ఞానేశ్వర్‌కు జీవిత ఖైదు, రూ.6500 జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారథి సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. హైదరాబాదులో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసే జ్ఞానేశ్వర్‌కు 2020 నవంబర్‌లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా చిన్న అవుటుపల్లిలోని సిద్ధార్థ డెంటల్ కళాశాలలో బిడిఎస్ మూడవ సంవత్సరం విద్యార్థిని పిన్నమనేని తపశ్వినితో పరిచయం ఏర్పడింది. తపశ్విని హాస్టల్‌లో ఉంటుండగా తల్లిదండ్రులు ముంబైలో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ అక్కడే ఉండేవారు. వీరి పరిచయం ప్రేమగా మారి 2021 మార్చిలో జ్ఞానేశ్వర్ హైదరాబాదులోని ఉద్యోగం వదిలి విజయవాడ వచ్చి ఇక్కడ మరో ప్రైవేట్ కంపెనీలో చేరాడు. తరచూ తపశ్విని వద్దకు కళాశాలకు వెళ్లి వస్తూ ఉండేవాడు. 2022 సెప్టెంబర్‌లో ఇద్దరూ కలిసి గన్నవరంలో ఓ గది అద్దెకు

▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య పక్కన గుంటూరు విజయ్‌కుమార్ తదితరులు

## మతోన్మాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి

- బిజెపిని ఓడించడం కోసం ప్రజలంతా ఏకమవ్వాలి
- అధికార పార్టీ అనుచర గణానికే విత్తనాలు
- ఎన్నికల కోడ్ రాకమునుపు వరికపూడిశెల పనులు ప్రారంభించండి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

దేశంలో పెరుగుతున్న మతోన్మాదాన్ని కూకటి వేళ్లతో పెకలించాలంటే బిజెపిని ఓడించడం ద్వారానే సాధ్యమని, ఇందుకు కృషి చేస్తున్న సిపిఎం ఉద్యమాల్లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం పల్నాడు జిల్లా

▶ 2లో

## విద్యాసంస్థలకు నేడూ సెలవు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా:** మిచౌంగ్ తుపాను నేపథ్యంలో చలి, ఈదురు గాలులతో పాటు విస్తారమైన వర్షాలు పడనున్న కారణంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలకు మంగళవారమూ సెలవు ప్రకటించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ప్రమాదాల నివారణకు జిల్లా యంత్రాం గానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను ఎస్సీ, బీసీలకు పంచాలని ధర్నా

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :** వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధిలోని జాలలపాలెం పరిధిలో గల సర్వే నం. 60/2, 60/9, 60/13, 60/11, 60/16, 113/2సి, 86బి, 68, 90, 67 తదితర సర్వే నంబర్లలో వందల ఎకరాల భూమి అన్యాక్రాంతమైనా అధికారులు పట్టించుకోవడం లేదని జైభీమ్ భారత్ పార్టీ గుంటూరు, పల్నాడు జిల్లాల సమన్వయకర్త గోదా జాన్‌పాల్ అన్నారు. జాలలపాలెంలోని 125 ఎకరాల ప్రభుత్వ భూములను గ్రామంలో భూమిలేని వ్యవసాయ కూలీలైన ఎస్సీ, బీసీలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ మేరకు నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో యాజమాన్యం, అధ్యాపకులు

## 41 మంది న్యూటన్స్ విద్యార్థులకు ఉద్యోగాలు

**ప్రజాశక్తి - విజయపురిసౌత్ :** మాచర్ల మండలం అలుగురాజుపల్లి సమీపంలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్టీల్ స్ట్రిప్స్ వీల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 41 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యనందించి వారికి ఉన్నత ఉద్యోగాలు లభించేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. తాజాగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి, డీన్ సందీప్‌రెడ్డి, టిపిఒ రామ్మోహన్‌రెడ్డి, ఖాసిం పాల్గొన్నారు.

## గుంటూరు ఛానల్‌ను విస్తరించే వరకూ పోరాటం

**ప్రజాశక్తి - పెదనందిపాడు :** గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని కోరుతూ నల్లమడ రైతుసంఘం ఆధ్వర్యంలో పెదనందిపాడులో చేపట్టిన నిరసన దీక్ష సోమవారం 15వ రోజుకు చేరింది. తుపాను ప్రభావంతో ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా రైతులు తమ దీక్షను కొనసాగించారు, నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగింపునకు అవసరమైన భూ సేకరణ నిమిత్తం నిధులు కేటాయించి పనులు ప్రారంభించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షల్లో సుబ్బారావు, డి.మంజూష, కె.రత్నకుమారి, డి.విజయలక్ష్మి, ఎల్.చౌడేశ్వరి, ఎం.పెద్దన్న, జె.సుధీర్, కె.చిన్న, ఎ.దేవకీదేవి, ఎ.వెంకటేశ్వర్లు, ఎ.సాంబశివరావు, కె.రమేష్, పి.మల్లికార్జున, కె.ధనవేణి, బి.ఛాయమ్మ, బి.కృష్ణకుమారి, ఎం.చిన్ననాగేశ్వరరావు పాల్గొన్నారు.

## మిచౌంగ్ ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

మంగళగిరి, కాకుమాను, పెదనందిపాడు తదితర మండలాల్లో కోతలకు వచ్చిన వరికి నష్టం కలిగే ప్రమాదం ఏర్పడింది. మెట్ట ప్రాంతంలో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. జోరు వాన వల్ల పూత, కాయదెబ్బతింది. తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి నేలరాలిపోతోంది. మిర్చి పైరుకు ప్రస్తుతం వర్షం ఊపరిపోసింది. వర్షం తీవ్రత వల్ల పల్నాడు,గుంటూరు జిల్లాల్లో పాఠశాలలకు మంగళవారం అధికారులు సెలవు ప్రకటించారు. గుంటూరులో ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడం వల్ల చలిగాలులు పెరిగాయి. రహదారులపై జనసంచారం తగ్గింది. చిరు వ్యాపారులకు ఇబ్బంది కలిగింది. వర్షంతో పలు ప్రాంతాల్లో మురుగునీరు ప్రధాన రహదారులపై ఏరులై పారింది.

# ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

'జగనన్నకు చెబుదాం'కు వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ అధి.కారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాలులో 'జగనన్నకు చెబుదాం' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ వసంత బాబు పాల్గొన్నారు. ప్రజల నుంచి మొత్తం 65 అర్జీలు వచ్చాయి.

శ్మశాన వాటికలనూ అధికార పార్టీకి చెందిన నాయకులు వదలడం లేదని, సమాధులు తొలగించి నేలను చదును చేసి కబ్జా చేయాలని చూస్తున్నారని పులిచింతల ప్రాజెక్ట్ నిర్వాసితులు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.అచ్చంపేట మండలం చిగురుపాడు రెవెన్యూ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ సెంటర్ శ్మశాన వాటిక కబ్జాకు ప్రయత్నించగా అడ్డుకున్నామని కుంబా శ్రీనివాసరావు చెప్పారు. పులిచింతల ప్రాజెక్టు నిర్వాసితులు పదేళ్లుగా వినియోగిస్తున్న శ్మశాన వాటిక భూమిని రాజకీయ నేతల అండతో ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని, గ్రామస్తుల ప్రతిఘటించడంతో జేసిబిలతో వారు ఉడాయించారని చెప్పారు. ఈ సంఘటనపై విచారణ జరిపించి శ్మశాన స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న పల్నాడు కలెక్టర్ ఎల్.శివశంకర్

## మతోన్మాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ సమావేశం సోమవారం జరిగింది. సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి అధ్యక్షత వహించగా కృష్ణయ్య మాట్లాడారు. ఇటీవల 4 రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో 3 రాష్ట్రాల్లో బిజెపి గెలుపొందడం చూస్తే మతోన్మాద ప్రమాదం ఏ స్థాయిలో ఉందో తేటతెల్లమైందన్నారు. మతోన్మాద బిజెపి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు బిజెపి వల్ల కార్మికులకు, కర్షకులకు, ఉద్యోగులకు మొత్తంగా దేశానికి కలిగే నష్టాలను వివరిస్తూ బిజెపి విధానాలను ఎండగట్టే కృషిలో సిపిఎం ఉందని, నిత్యం ప్రజల సమస్యలపై పోరాడుతోందని చెప్పారు. బిజెపి ప్రమాదాన్ని గుర్తించి బిజెపి వ్యతిరేకులను, ఆ పార్టీ విధానాలకు బలవుతున్న కార్మికులు, ఉద్యోగులు, ఇతర రంగాల ప్రజలను ఐక్యం చేయాల్సి ఉందని, బిజెపి, దాని మిత్ర పక్షాలు అధికారంలోకి రాకుండా ఐక్యంగా కృషి చేయడానికి ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపాల్సి ఉందని అన్నారు.

సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని సాగు భూమిలో సగం బీడుగా ఉందని, ఆరుతడి పంటలు సాగుచేయాలనే ప్రభుత్వం ప్రకటనతో సాగు చేసిన పంటలు సైతం నీరులేక ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. అయినా ఒక్క మండలాన్నీ ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న, సన్నకారు రైతులు వడ్డీలకు అప్పుడు తెచ్చిమరీ పెట్టుబడులు పెట్టారని, కరువు మండలంగా ప్రకటించి ఉంటే నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి రాయితీలు రైతులకు దక్కేవని చెప్పారు. ఒక్క ఎకరాను కూడా ఖాళీగా ఉంచొద్దని ఇటీవల ఒక సమీక్షలో జిల్లా కలెక్టర్ చెప్పారని, నీరు లేకుండా ఏ పంటలు సాగు చేయాలో పరిశీలన, ఆచరణ లేకుండా సమీక్షలతో సరిపెడితే ఎలాగని ప్రశ్నించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు సరిగా అందుబాటులో లేవని, ఉన్న కొద్దిపాటి విత్తనాలు కూడా రాజకీయ పార్టీలు వారి అనుచర గణానికి చెందిన రైతులకే ఇప్పిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల కోడ్ రాకమునుపే వరికపూడిశెల ప్రాజెక్టు పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను వేధించడం మానుకొని వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆశాలను యాప్‌ల పేరుతో వేధింపులకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈనెల 11, 12 తేదీల్లో 36 గంటలు ధర్నా చేస్తున్నారని, వారి పోరాటాలకు సిపిఎం మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రకటించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు, నాయకులు డి.శివకుమారి, జి.మల్లీశ్వరి, డి.విమల, పి.మహేష్, టి.పెద్దిరాజు, జి.బాలకృష్ణ పాల్గొన్నారు.

## రాజధాని రైతులకు ఊరట


(మొదటి పేజీ తరువాయి)

వైసిపి ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని విస్మరించింది. ఆరు నెలలు కాలయాపన చేసిన తరువాత 2019 డిసెంబరు 17న అసెంబ్లీలో మూడు రాజధానుల బిల్లును ప్రవేశపెట్టారు.

బిల్లు ఆమోదం పొందిన తరువాత రైతులు ఉద్యమ బాట పట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు నాలుగేళ్ల పాటు నిరంతరాయంగా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. వివిధ దశల్లో న్యాయపోరాటం చేశారు. సుదీర్ఘకాలం విచారణ తరువాత గత ఏడాది మార్చి 3న మూడు రాజధానుల చట్టాన్ని కొట్టివేస్తూ అమరావతిని ఆరునెలల్లోగా అభివృద్ధి చేయాలని హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాజధాని అభివృద్ధిపై కాలపరిమితి విధించడం సరికాదని పేర్కొంటూ ఈ అంశంపైనే సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. కానీ మూడు రాజధానుల చట్టం రద్దు, రైతుల ఇతర డిమాండ్లపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వకుండా విచారణ కొనసాగిస్తామని ప్రకటించింది. ప్రస్తుతం అటు రైతులు, ఇటు ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరగాల్సి ఉంది. సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉండగానే గత నాలుగు నెలలుగా పలు దఫాలుగా విశాఖపట్నంకు పరిపాలన కేంద్రంను తరలించేందుకు సిఎం జగన్ పలు తేదీలు ప్రకటించినా ఆచరణ సాధ్యంకాలేదు.

మరో మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు వస్తుందా లేదా అన్న సంశయం లేకపోలేదు. ఈ ఏడాది వార్షిక కౌలు కూడా ప్రభుత్వం ఇంత వరకు రైతులకు ఇవ్వలేదు. రిటర్నుబుల్ ప్లాట్‌ల అప్పగింతలో జరిగిన జాప్యం వల్ల రైతులకు ఆర్థికంగా ఎంతో నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో అమరావతి రైతులు అన్ని స్థాయిలో ఇప్పటికే వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ఆందోళనలను కొనసాగించారు. తాజాగా కేంద్రం ఇచ్చిన ప్రకటనతో అమరావతికి ఎటువంటి ఢోకా లేదని రైతుల్లో ధీమా వ్యక్తం అవుతోంది.

# కోటప్పకొండపై అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

కోటప్పకొండపై రూ.80 లక్షల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. నిత్యాన్నదాన మండపం, వంటశాల, వసతి గదులు, లిఫ్ట్ పనులు చేపట్టనున్నారు. నిర్మాణానికి సహకరించిన దాతలు చిలకలూరిపేటకు చెందిన తేళ్ల సుధీర్, శ్రీధర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కోటప్పకొండ తిరునాళ్ల నాటికి పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం.శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి చిట్టిబాబు, కొండకావూరు సర్పంచ్ వి.నాగిరెడ్డి, కమిటీ సభ్యులు ఎం.లింగారెడ్డి, ఆలయ సిబ్బంది నాగిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ సిఎం కొణిజేటి రోశయ్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా నరసరావుపేటలోని శివునిబొమ్మ సెంటర్లో రోశయ్య విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఆర్యవైశ్య సంఘం, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## 17న గుంటూరులో రాష్ట్ర స్థాయి సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

డి.లక్ష్మీనారాయణ వై.నేతాజి ప్రసంగిస్తారని తెలిపారు. సదస్సు నిర్వహణకు ఉద్యోగులు, కార్మికులు ప్రముఖులు సహకరించి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, నాయకులు జి.లూథర్‌పాల్, షేక్ ఖాసీం షాహిద్ పాల్గొన్నారు.

## డెంటల్ విద్యార్థిని హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొని కొంతకాలం కలిసున్నారు. ఆ సమయంలో తపస్విని వద్ద నుంచి బంగారు ఆభరణాలు తీసుకున్న జ్ఞానేశ్వర్ వాటిని రూ1.40 లక్షలకు తనఖా పెట్టి సొమ్ము చేసుకున్నాడు. జ్ఞానేశ్వర్ బైక్ కొనేందుకు రూ.37,500 చెల్లించగా మిగిలిన రూ.7500 తపశ్విని చెల్లించారు. కొంతకాలానికి జ్ఞానేశ్వర్ తపశ్వినిని అనుమానించటం ప్రారంభించగా ఆమె గన్నవరంలోని గది ఖాళీ చేసి తక్కెళ్లపాడులో నివాసం ఉంటూ సిబార్ డెంటల్ కళాశాలలో బీడీఎస్ మూడవ సంవత్సరం చదువుతున్న తన బాల్య మిత్రురాలైన చింతకింది విభ వద్దకు వచ్చారు. ఈ క్రమంలో నవంబర్ 7న తపశ్విని వద్దకు వెళ్లిన జ్ఞానేశ్వర్ పెళ్లి చేసుకోవాలని, లేకుంటే చంపుతానని బెదిరించాడు. దీనిపై తపశ్విని నూజివీడు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు జ్ఞానేశ్వర్‌ను పిలిచి మందలించారు. అతను తాకట్టులో పెట్టిన బంగారాన్ని విడిపించి తపశ్వినికి ఇప్పించారు. పెళ్లికి నిరాకరించిందనే కక్షతో తపశ్విని‌ని చంపాలని జ్ఞానేశ్వర్ నిర్ణయించుకున్నాడు. 2022 డిసెంబర్ 5న కత్తి, సర్జికల్ బ్లేడ్లు కొని తన బైక్‌పై రాత్రి 8.30 గంటలకు తక్కెళ్లపాడులోని తపశ్విని ఉంటున్న ఇంటి వద్దకు వచ్చాడు. గదిలో ఉన్న తపశ్విని వద్దకు వెళ్లి పెళ్లి ఒత్తిడి చేయగా ఆమె నిరాకరించడంతో కత్తితో దాడికి దిగాడు. తపశ్విని ఎడమ వీపుపై పొడవటమే కాక సర్జికల్ బ్లేడ్లతో గొంతు చేతులపై తీవ్రంగా గాయపరిచాడు. ఆ గదిలోనే ఉన్న తపశ్విని మిత్రురాలు విభ గది నుండి బయటకు వచ్చి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చారు. ఈలోగా జ్ఞానేశ్వర్ ఆ గదికి లోపల నుండి గడియ పెట్టి తాను సర్జికల్ బ్లేడుతో గొంతుపై కోసుకున్నాడు. చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగలగొట్టి జ్ఞానేశ్వర్‌ను కట్టివేశారు. 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా వారు వచ్చి తపశ్విని‌ని గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలిని అప్పటి పెదకాకాని సిఐ బి.సురేష్‌బాబు పరిశీలించి జ్ఞానేశ్వర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తపశ్విని మేనత్త డాక్టర్ కొల్లి మాధవి ఫిర్యాదు మేరకుజ్ఞానేశ్వర్‌పై హత్యా నేరం కింద పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేశారు. సిఐ మహేష్‌బాబు కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో నిందితుడు జ్ఞానేశ్వర్‌కు బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించి జైలులో ఉంచి కేసు విచారణ చేపట్టింది. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుల్తాన్ సిరాజుద్దీన్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. జ్ఞానేశ్వర్‌కు ఉరి శిక్ష విధించాలని వాదించారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పార్థసారథి జీవిత ఖైదు విధించారు.

# నిర్మల ఫార్మసీలో తరగతుల ప్రారంభోత్సవ వేడుక

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో బి ఫార్మసీ , ఫార్మా డి మొదటి సంవత్సరం తరగతులు 2023-2024 సంవత్సరానికి సోమవారం నుండి ప్రారంబ మైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి పాములరెడ్డి తెలియ జేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ పి ఉమామహేశ్వరి దేవి, వైస్ చైర్ పర్సన్ ఎపి ఎస్ సి హెచ్ ఈ, గౌరవ అతిథిగా ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ డాక్టర్ యు శౌరీలు, కళాశాల సెక్రటరీ రెవరెండ్ సిస్టర్ జి నిర్మల జ్యోతి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుకలో మొదటిగా కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ డాక్టర్ యు శౌరీలు పారంభ ఉపన్యాసం ఇచ్చారు. ఈ కళాశాలను ఎంపిక చేసుకున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియచేస్తూ విద్యార్థులు సత్ప్రవర్తన, క్రమశిక్షణతో పాటు పట్టుదలతో చదివి ఉన్నత శిఖ రాలను అధిరోహించాలని, తల్లిదండ్రుల కళలను నెర వేర్చాలని కోరారు. ప్రొఫెసర్ ఉమా మహేశ్వరి దేవి మాట్లాడుతూ సమాజంలో ఫార్మసిస్టలకు గల బాధ్యతలు, గొప్పతనాన్ని వివరించారు ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో నడచుకొను విధా నాన్ని, వారి బాధ్యతలను వివరించారు. పట్టుదలతో, క్రమశిక్షణతో సాగాలని విద్యార్థులకుసూచించారు. మానవతా విలువలపై నిర్మల జ్యోతి వ్యాఖ్యానిస్తూ విద్యా ర్థినీ విద్యార్థులకు సమయ పాలన అనేది చాలా ముఖ్యమని, తమ కళాశాలలో సమయపాలనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. 2023 -24 సంవత్సరం కళాశాల నూరు శాతం అడ్మిషన్లు సాధించిందని సంతోషం వ్యక్తం చేశారు. పాముల రెడ్డి కళాశాల ప్రగతిని వివరించారు. విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాలను ఈ సందర్భంగా ఆయన నివృతి చేశారు. కార్యక్రమంలో కళాశాల హెచ్ఒడిలు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బి.పాములరెడ్డి, ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరి దేవి తదితరులు

## రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి



**ప్రజాశక్తి - మంగళగిరి**

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను సజావుగా జరిగేలా చూడాలని నవ రంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కలిసి వినతిపత్రం అందజేశారు. తమ పార్టీకి ఓటర్ లిస్టు ఇవ్వాలని విన్నవించారు. ఏపిలో 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాల్లో తాము పోటీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సయ్యద్ సైదా, హుస్సేన్ పాల్గొన్నారు.



## మిర్చి నిల్వలు

| | బ్యాగులు |
|---|---|
| మిర్చి దిగుమతి | : 29,359 |
| మిర్చి ఎగుమతి | : 24,619 |
| మిర్చి నిల్వ | : 14,785 |

## మిర్చి ధరలు

| | రూపాయలలో |
|---|---|
| 334 | 8,000 - 23,000 |
| నెం.5 | 8,000 - 16,500 |
| 273 | 8,000 - 17,500 |
| 341 | 12,000 - 19,000 |
| సూపర్ 10 | 15,000 - 16,000 |
| | నాన్ ఎసి |
| తేజ | 10,000 - 24,000 |
| బడిగి | 8,000 - 24,000 |
| దేవనూరు డీలక్స్ | 12,000 - 22,000 |
| తాలుకాయలు | 5,500 - 13,500 |
| | ఎసి |
| 334 | 15,000 - 15,000 |
| నెం.5 | 13,000 - 14,500 |
| 341 | 15,000 - 19,500 |
| తేజ | 8,000 - 24,000 |
| బడిగి | 9,500 - 22,200 |
| దేవనూరు డీలక్స్ | 14,500 -17,000 |
| తాలుకాయలు | 6,500 -10,000 |



## మిర్చి పంటలో యాజమాన్య పద్ధతులు



**ప్రజాశక్తి-విజయపురిసౌత్ :** పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయ టకు పంపి వేయాలని వర్షాలు ఆగిన వెంటనే 19: 19:19 లేదా 13: 00:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారి చేయాలని మాచర్ల ఉద్యానవన శాఖాధికారి ఎన్. సురేష్ సూచిం చారు. వెల్దుర్తి మండలంలోని మండాది, ఉప్పల పాడులలో పంటలను సోమవారం ఆయన పరి శీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాలు ఆగిన వెంటనే అంతర సేద్యం చేసి కలుపును తొలగించడమే కాకుండా నేల త్వరగా ఆరే టట్లుగా చూసుకోవాలని, పొలంలో నీరు నిలవ ఉం డడం వలన ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంది కనుక దాని నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా మెటలాక్సిల్, మ్యాంకోజెబ్ కలిగిన తెగులు మందును రెండు గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని మొక్కల మొదలలో పోయాలని చెప్పారు. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం వలన ఆకు మచ్చ తెగులు, బూడిద తెగులు ఆశించే అవకాశం ఉంది కనుక ఆకుమచ్చ తెగులు నివా రణకు కార్బ డైజిమ్ ఒక గ్రాము లీటర్ నీటికి లేదా మాం కోజెబ్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలుప కొని పిచికారి చేయాలని సూచించారు.

# సూపర్ మార్కెట్‌లో భారీగా మంటలు

## నూనెలు, ఇతర నిత్యావసరాలు దగ్ధం - రూ.3 కోట్ల వరకు ఆస్తి నష్టం

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

నరసరావుపేట - చిలకలూరిపేట మార్గంలో గుంటూరు - కర్నూలు జాతీయ రహదారి ప్రక్కనున్న చరిష్మ సూపర్ మార్కెట్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తెల్లవారుజామున 2.30 గంటలప్పుడు దుకాణంలో చిన్నగా మంటలు రావడంతో వాచ్‌మెన్‌లు గమనించి యజమాని నాగేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. అనంతరం మంటలు వేగంగా విస్తరించడం మొదలైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను ఉదయం 8 గంటల వరకు అదుపు చేస్తూనే ఉన్నారు. వంట నూనె, తదితర నిల్వలకు మంటలు అలుముకోవడంతో అదుపు చేయడం అగ్నిమాపక సిబ్బందికి సవాలుగా మారింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సత్తెనపల్లి, పిడుగురాళ్ల, ఫిరంగిపురం, నరసరావుపేట తదితర ప్రాంతాల్లో స్టోర్లు ఏర్పాటు చేసి సరుకులను సరఫరా చేస్తున్నారు. కోట సెంటర్‌లో ఉన్న స్టోర్‌ను, చిలకలూరిపేట రోడ్‌లో ఉన్న స్టోర్ కొద్ది నెలల క్రితమే ప్రారంభించారు. ఇక్కడి నుంచే అన్ని ప్రాంతాలకు సరుకులు సరఫరా చేస్తుంటారు. మంటలను చూసిన యజమాని నాగేశ్వరరావు బోరున విలపించారు. రూ.3 కోట్ల వరకూ నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రమాద స్థలికి అతి సమీపంలో 2 పెట్రోల్ బంకులున్న దృష్ట్యా ఎగిసి పడుతున్న మంటలు వలన పెద్ద ప్రమాదం, ప్రాణ నష్టం వాటిల్లిదేనని, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడం పట్ల సిబ్బందికి స్థానికులు అభినందనలు తెలిపారు.



సూపర్‌మార్కెట్‌లో నుండి ఎగసిపడుతున్న మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


నందిగంలో పత్తి తీతకు సిద్ధంగా ఉన్న పొలం

## తుపానుతో పత్తి రైతల్లో తీవ్ర కంగారు

**ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్**

మిచౌంగ్ తుపాను ప్రభావంతో సత్తెనపల్లిలో మోస్తరు చిరుజల్లులు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుండి చిరుజల్లులు పడుతున్నాయి. మెట్ట, మాగాణి రైతులకు తుపాను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. చిరుజల్లులుకు పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాల కురిస్తే పత్తి తడిసి నల్లగా మారుతుందని వాపోతున్నారు. పత్తి గూల్లోకి నీరు చేరి మొక్క వస్తుందని, దీనివలన దిగుబడి తగ్గటంతో పాటు ధర తగ్గుతుందని భయపడుతున్నారు. పుల్ల శనగ పంటకూ ఈ తుపాను తీవ్ర నష్టం చేస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే మిర్చిరైతులు మాత్రం వర్షంపై హర్షం వ్యక్తం చేస్తున్నా తీవ్రంగా గాలులు వీస్తే పూత, పిందెలు రాలుతాయని కంగారుపడుతున్నారు.

## ఒరిగిన కరెంటు స్తంభం

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**



నరసరావుపేట పట్టణంలోని స్టేషన్‌రోడ్‌లో ధర్నా చౌక్ వద్ద గల పెట్రోల్ బంకు ఎదురు డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభం గాలికి ఒరిగి ప్రక్కనే ఉన్న విద్యుత్ తీగెలపై పడింది. మున్సిపల్ విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమై మరమ్మతులు చేపట్టారు. ప్రమాదమేమీ జరక్క పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


లబ్ధిదారునికి కారు తాళాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

## ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి నవోదయం

### ఇద్దరు లబ్ధిదార్లకు వాహనాలను అందించిన పల్నాడు కలెక్టర్

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :** పల్నాడు జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం ప్రతినెలా 14న నిర్వహిస్తున్న 'నవోదయం' కార్యక్రమంలో వారి జీవితాలలో వెలుగులు నింపుతోందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. గతంలో జరిగిన నవోదయం కార్యక్రములో దరఖాస్తు చేసుకున్న క్రోసూరు మండలం ఎర్రబాలేనికి చెందిన ఎకోలు రతన్‌బాబుకు 45 శాతం సబ్సిడీతో గుంటూరు కోటక్ మహేంద్ర బ్యాంక్ సౌజన్యంతో జగనన్న బడుగు వికాసం కింద రూ.10 లక్షలు వాహనాన్ని (బడా దోస్త్) కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ అందించారు. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువుకు చెందిన దర్శి మనీష్‌కు తుమ్మలచెరువు ఎస్‌బిఐ సౌజన్యంతో రూ.26 లక్షలతో ఇన్నోవా వాహనాన్ని జగనన్న బడుగు వికాసం క్రింద కలెక్టర్ అందించారు. కార్యక్రములో డిఆర్‌డిఎ పీడీ బాలూనాయక్, సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఓబుల్ నాయుడు, నవోదయం కో-ఆర్డినేటర్ సంజీవరావు, ఎల్‌డిఎం పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా సరిహద్దుల్లో బోర్డుల ఏర్పాటు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :** పల్నాడు జిల్లాలో రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా సరిహద్దు బోర్డుల ఏర్పాటు ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర, జిల్లా, మండల హద్దులు చూపే సైన్ బోర్డులను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నారు. మిషన్ శోభాకృత్‌లో భాగంగా పల్నాడు జిల్లాలో అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా, అంతర్ మండల సరిహద్దులు బోర్డులు 324 ఏర్పాటు చేశారు. దీనిపై మండల ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులు, జిల్లా స్థాయిలో ఆర్‌డిఒల ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ బోర్డులు పెడుతున్నారు. రాత్రి సమయంలోనూ కనిపించేలా వీటిని పెడుతున్నారు. 29 అంతర జిల్లా స్థానాల్లో 58 బోర్డులు, 4 అంతర్రాష్ట్ర స్థానాల్లో 8 బోర్డులు, 129 మండలాల పరిధిలో 258 బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు.




# కాంగ్రెస్ పార్టీ గెలుపు సంబరాలు


**ప్రజాశక్తి - వినుకొండ**



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించటంతో సోమవారం వినుకొండలోని శివయ్య స్థూపం సెంటర్‌లో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంచారు. కాంగ్రెస్ వినుకొండ నియోజకవర్గ నాయకులు ఆర్‌కె నాయుడు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు విజయాన్ని అందించి కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకున్నారని అన్నారు. రాష్ట్రమైనా, దేశమైన అభివృద్ధి చెందాలంటే అది కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని చెప్పారు. కర్ణాటకలో మొదలైన కాంగ్రెస్ పార్టీ విజయ సునామి తెలంగాణకు చేరిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ గెలుపు సునామీ వస్తుందని, పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు నాయకత్వంలో, డిసిసి అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎం.ప్రసాద్‌బాబు, నాయక్, జి.ప్రసాద్, కోటేశ్వరరావు, మీరావలి, రెహమాన్. సాయి, రమేష్. చిరంజీవి, బ్రహ్మం పాల్గొన్నారు.

## విరిగిపడిన కొమ్మలు

**ప్రజాశక్తి - యడ్లపాడు :** తుపాను కారణంగా మండలంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఉదయం నుంచి చిరుజల్లులు, సాయంత్రానికి భారీ వర్షం కురిసింది. చలిగాలు పెరిగాయి. బోయపాలెం నుండి సంఘం గోపాలపురం వెళ్లే మార్గంలో మధ్యాహ్నం 3 గంటలకు ఆశ్రమం వద్ద ఓ చెట్టు కొమ్మలు విరిగి రోడ్డుపై అడ్డంగా పడంతో యడ్లపాడుతోపాటు నిత్యం రద్దీగా ఉండే బోయపాలెం వీధిలోనూ రెండు మూడు గంటలపాటు రాకపోకలు స్తంభించాయి. పంచాయతీ సిబ్బంది వీటిని తొలగించారు.



## తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

**ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్**

మిచౌంగ్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సురేష్ విజ్ఞప్తి చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో తుపాను కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సోమవారం తెలిపారు. బుధవారం వారం వరకు కంట్రోల్ రూమ్ ఉంటుందని, ఇందులో ఐదుగురు సిబ్బందిని నియమించామని చెప్పారు. అత్యవసర సమయాల్లో 9182826935, 9652049574, 9704261176, 9966843745, 9182454033 సెల్‌ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

## యుటిఎఫ్ నేత దత్తు మృతికి సిపిఎం సంతాపం

**ప్రజాశక్తి- పల్నాడు జిల్లా**

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన యుటిఎఫ్ ఉద్యమ నేత దత్తుకు సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యమం మొదటి తరం నాయకుల్లో దత్తు ప్రముఖులని, నిబద్ధత కలిగిన ఉపాధ్యాయునిగా పనిచేస్తూ విద్యార్థుల్లో, తోటి ఉపాధ్యాయులలో అభ్యుదయ భావాలను, పోరాట స్ఫూర్తిని నింపారని చెప్పారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో 10 తరగతి మోడల్ పేపర్‌కు పునాది వేయటంలో దత్తు కీలక పాత్ర పోషించారన్నారు. మోడల్ పేపర్ వల్ల 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు పట్ల భయం వీడి మంచి మార్కులు సాధించారని గుర్తు చేశారు. ఉపాధ్యాయ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన దత్తు మృతి ప్రజాతంత్ర ఉద్యమాలకు లోటన్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ దత్తు తన కుటుంబాన్ని వామపక్ష ఉద్యమం వైపు నడిపిన తీరు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా, కోశాధికారిక అకాడమిక్ సెల్ చైర్మన్‌గా సమర్థవంతంగా పనిచేయడంతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకృష్ణ, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, జి.రవిబాబు, డి.శివకుమారి, జి.మల్లేశ్వరి, విమల, పి.మహేష్, టి.పెద్దిరాజు, జి.బాలకృష్ణ, కె.హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

## మట్టి అక్రమ తవ్వకంలో అధ్విపత్యం కోసం అధికార పార్టీలో గ్రూపుల వివాదం..

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :** నరసరావుపేట మండలం ములకలూరులో చెరువు మట్టి అక్రమ తవ్వకం, తరలింపు విషయంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గ్రూపునకు, ఆయన వ్యతిరేక గ్రూపునకు చెందిన డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి అనుచరులకు స్వల్ప వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో సహనం కోల్పోయినన ఇరు గ్రూపులు పరస్పరం దాడి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరు పక్షాలను చెదరగొట్టి మట్టి తవ్వకాలను నిలిపేయించారు. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. చెరువు పూడిక మట్టి తరలింపు విషయంలో ఆధిపత్యం కోసమే ఘర్షణ తలెత్తినట్లు పోలీసులు నిర్ధారించారు.



# నిండా ముంచిన మిచౌంగ్ తుపాను

- ఆరుగాలం శ్రమించిన అన్నదాతల్లో తీవ్ర ఆందోళన
- వర్షానికి పొలాల్లోనే నిలిచిన వరికోత యంత్రాలు


నేలపాడు రోడ్డులో కోతకు సిద్ధంగా ఉన్న వరి

ప్రజాశక్తి-తెనాలి/తెనాలిరూరల్

**ఎన్నో ఆశలతో ఆరుగాలం శ్రమించిన అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మిచౌంగ్ తుపాను కారణంగా మొదలైన వర్షం, గాలులు రైతన్నల ఆశలు అడియాశలు చేస్తున్నాయి. గాలుల ప్రభావానికి పంట నేలకొరిగిపోతోంది. వాతావరణ శాఖ, వ్యవసాయశాఖ అధికారుల హెచ్చరికలతో అప్రమత్తమైన రైతులు చేతికందిన పంటను దక్కించుకునే ప్రయత్నం చేసినా అది పెద్దగా ఫలితాన్నివ్వలేదు. దీంతో అన్నదాత దిగాలు పడుతున్నారు.**

కృష్ణా వెస్ట్రన్ డెల్టా పరిధిలో ఖరీఫ్‌లో దాదాపు 5.75లక్షల ఎకరాలు సాగులో ఉంది. రైతులు అధిక శాతం వరి సాగుచేస్తారు. ఈ ఏడాది రైతులు ఆశించిన స్థాయిలో అవసరమైన సమయంలో వర్షాలు లేవు. ఖరీఫ్ ప్రారంభంలో అధిక వర్షాలు రెండు విడతలుగా రైతులను దెబ్బతీశాయి. వెద పద్ధతిలో వేసిన వరి భారీ వర్షాలకు ముంపుకు గురికావటంతో, రెండో సారి కూడా కొందరు రైతులు వెద పెట్టారు. కొందరు నాట్లు వేశారు. చివరి దశలో వర్షాభావ పరిస్థితులను సైతం ఎదుర్కొని రైతులు సేద్యంలో ముందుకు సాగారు. ఈ నేపథ్యంలో బంగాళాకాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారి మిచౌంగ్ తుపాను రూపంలో రైతులను తీవ్ర ఇబ్బదులకు గురిచేస్తోంది. వాతావరణ శాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతులను అప్రమత్తం చేసింది. ఈనెల 4, 5 తేదీల్లో తుపాను ప్రభావం డెల్టా ప్రాంతంలో అధికంగా ఉంటుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెప్పారు. అలాగే వరికోత యంత్రాలను అందుబాటులోకి తెచ్చామని, కోతకు సిద్ధంగా ఉన్న వరిని కోయించాలని రైతులకు చెప్పారు. వ్యవసాయశాఖ తెనాలి ఏడిఏ పరిధిలో దాదాపు 46,200 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. దీనిలో తెనాలి మండలంలో 12500, దుగ్గిరాల మండలంలో 19700, కొల్లిపర మండలంలో 14వేల ఎకరాల్లో వరి సాగులో ఉంది. దీనిలో ఇప్పటికే తెనాలి మండలంలో 3వేలు, దుగ్గిరాల మండలంలో 2వేలు, కొల్లిపర మండలంలో 600 ఎకరాల్లో వరికోత యంత్రాల ద్వారా రైతులు కోతలు పూర్తి చేశారు. కాగా మూడు మండలాల్లో కలిపి మరో 22వేల ఎకరాలు కోతకు సిద్ధంగా ఉంది. మూడు మండలాలకు కలిపి 20 వరికోత యంత్రాలు అందుబాటులోకి తెచ్చామని, జిల్లా యంత్రాంగం చొరవతో మరి కొన్ని యంత్రాలు కూడా అందుబాటులోకి తెస్తామని ఏడిఏ చెప్పిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం కూడా పొద్దుపోయేంత వరకు కూడా వరికోతలు సాగాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి విపరీతమైన గాలులు వీచాయి. సోమవారం ఉదయానికి వర్షం కూడా ప్రారంభమైంది. దీంతో వరికోత మిషన్లు కూడా పొలాల్లోనే ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మంగళవారం తుపాను ప్రభావం అధికంగా ఉంటుందని యంత్రాంగం చెబుతున్న నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.


తేలప్రోలు రోడ్డులో పొలాల్లో నిలిచిపోయిన వరికోత యంత్రాలు

### తుపాను ప్రభావం నష్టమే

**ఎన్.ఉషారాణి, ఏడిఏ, తెనాలి**

వరి కోతలకు సిద్ధమైన దశలో వర్షం రైతులకు ఇబ్బంది కరమే. ఈనెల 4, 5 తేదీల్లో తుపాను ప్రభావం అధికంగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రైతులను అప్రమత్తం చేశాం. శుక్ర, శని, ఆదివారాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరిని వరికోత యంత్రాల ద్వారా కోతలు పూర్తిచేయాలని చెప్పాం. ఆమేరకు రైతులు కొందరు పంట దక్కించుకునే ప్రయత్నం చేశారు. ఇక తుపాను ప్రభావంతో ఏమేరకు నష్టమన్నది వేచి చూడాల్సిందే.

### పంటలు వర్షార్పణమే... ప్రభుత్వమే ఆదుకోవాలి

**ఎం.కోటేశ్వరరావు, కౌలు రైతు, ఐతానగర్**



నేను రెండు ఎకరాల పొలం కౌలుకు సాగు చేస్తున్నాను. ఎకరానికి దాదాపుగా కౌలుతో కలిపి రూ.40 వేల చొప్పున పెట్టుబడులు పెట్టాం. వరి కోతకు సిద్ధమైన దశలో తుపాను ప్రభావం మా వెన్ను విరిచింది. దీని తీవ్రత పెరిగితే పంట వర్షార్పణమే. నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

### కోతకు సిద్ధమైన సమయంలో వాన

**టి.గోవిందయ్య, కౌలురైతు, తేలప్రోలు**



తుపాను ప్రభావం పంటలపై తీవ్రంగానే ఉంది. నేను 2.20 ఎకరాలు వరి సాగుచేస్తున్నాను. అధికశాతం బిపిటి రకం సాగుచేస్తుంటే నేను మాత్రం నంబర్ల రకం వరి సాగుచేస్తున్నా. మసూరితో పోల్చితే బస్తాకు రూ.200 ధర తక్కువే ఉంటుంది. మొత్తం మీద ఈ సమయంలో కోతలు సజావుగా సాగి, పంట విక్రయిస్తే కనీసం బస్తాకు రూ.1500 లభించే అవకాశం ఉంది. కోతకు సిద్ధమైన వేళ వర్షంతో పంట నష్టపోతాం.

## రైతులకు కోలుకోని దెబ్బ

**ప్రజాశక్తి-దుగ్గిరాల :** బంగాళాఖాతంలో ఏర్పడిన మిచోంగ్ తుపాన్ ప్రభావం వలన కురుస్తున్న వర్షాలు రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. ఆదివారం రాత్రి నుండి కురుస్తున్న వర్షానికి పంట తడిసి బరువెక్కింది. దీనికి తోడు గంటకు దాదాపు 40 కిలో మీటర్ల వేగంతో వీ స్తున్న ఈదురు గాలులకు ముదురుచేలు కుప్పకూలాయి. తుపాను తీవ్ర రూపం దాల్చి మచిలీపట్నం నెల్లూరు మధ్య తీరం దాటి అవకాశం ఉందని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. భారీ వర్షాలు కురిస్తే పంట చేతికందే అవకాశం లేదు. విత్తనాలు నీట మునిగి మొలికెత్తే ప్రమాదం ఉన్నది. అతివృష్టికి ఎదురొడ్డి పంట పండించారు. అకాల వర్షాలతో వరిచేలతో పాటు వాణిజ్య పంటలు అరటి, సపోటా, నిమ్మతో సహా కూరగాయలు తోటలు కూడా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నది. వరి కోతలకు ఇప్పటివరకు గంటకు రూ.మూడు వేలు మిషన్ కోతకు చెల్లిస్తున్నారు. ఎకరాకు గంట నుండి గంటన్నర పడుతుంది. నేల వాలిన చేలకు మూడు నుండి నాలుగు గంటలు పట్టే అవకాశం ఉందని రైతులు తెలుపుతున్నారు.


దుగ్గిరాల మండలంలో నేలవాలిన వరి పొలం



## పైరు నేలకొరిగిన పొలాల్లో పరిశీలన

**ప్రజాశక్తి-తెనాలిరూరల్ :**తుపాను కారణంగా నేలకొరిగిన పంటపొలాలను రైతులు రక్షించుకోవాలని మండల వ్యవసాయ స్పెషల్ అధికారి వనజ పేర్కొన్నారు. సోమవారం బుర్రిపాలెంలో వరి పంటను తహశీల్దార్ కె రవిబాబుతో కలసి పరిశీలించారు. తెనాలి మండల వ్యాప్తంగా 16 వేల ఎకరాల్లో వరి సాగుచేయగా 2 వేలు ఎకరాలు మాత్రమే కోతలు జరిగాయని తెలిపారు. మిగతా 14 వేల ఎకరాలు కోతల సమయంలో తుపాను రావడం బాధాకరమన్నారు. బలంగా వీస్తున్న ఈదురుగాలులకు నేలమెట్టమైన వరిపంటలో నీరు నిల్వ లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ రవిబాబు అన్నారు. వరిచేలుకు అనుకొనివున్న గట్లకు అక్కడక్కడా గండ్లు తవ్వి వర్షపునీరు నిల్వలేకుండా చూడాలని మండల వ్యవసాయ అధికారి ప్రేమ సాగర్ తెలిపారు.

## కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం కొనాలి : టిడిపి

**ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్**

తుపాను కారణంగా వరి ధాన్యం రైతులు ఆందోళనలో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాన్ని గ్రామంలో ఏర్పాటు చేసి, ధాన్యం కొనుగోలు చేయాలని టిడిపి చిర్రావూరు గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు సోమవారం పత్రికా ప్రకటన ద్వారా అధికారులను కోరారు. ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో సుమారు 300 ఎకరాలకు పైగా రైతులు వరి ధాన్యాన్ని సాగు చేస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు 50 శాతం వరకు మాత్రమే వరి కోతలు కోశారని అన్నారు. ఎక్కువ భాగం కల్లాలలోనే ధాన్యం బస్తాలు ఉన్నాయన్నారు. తుపానుకు రైతులు ధాన్యం తడవకుండా బస్తాలను ఇళ్లకు చేర్చుకునే పనిలో ఉన్నారని, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి, ధాన్యాన్ని రైతుల వద్ద నుండి కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## తోతట్టు ప్రాంత ప్రజలను తరలించాలి

**గ్రామ,వార్డు రెవెన్యూ కార్యదర్శులతో తహశీల్దార్ సమావేశం**

**ప్రజాశక్తి-మంగళగిరి :**తుపాను నేపథ్యంలో మంగళగిరి తహసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జివి రాంప్రసాద్ సోమవారం గ్రామ, వార్డు రెవెన్యూ కార్యదర్సులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లతో సమావేశాన్ని నిర్వహించారు. తుపాను కారణంగా భారీ వర్షాలు, వరదలు వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ రాంప్రసాద్ సూచించారు. వరదలు వస్తే లోతట్టు ప్రాంతాల ప్రజ లను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. లోతట్టు ప్రాంతాలను ఇప్పటికే గుర్తించడం జరిగిందన్నారు. వరద ముంపు ఎక్కువగా ఉండే ప్రాంతాల ప్రజలకు పలు జాగ్రత్త చర్యలను సూచించాలని కోరారు. మండలంలో రైల్వే ట్రాక్ విస్తరించి ఉన్న ప్రాంతాల్లో ట్రాక్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి సమాచారాన్ని తెలియ జేయాలని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సహాయక చర్యలను ప్రారంభించాలని ఆయన ఆదేశిం చారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎవరికి సెలవు మంజూరు చేయడం జరగదని ఆయన పేర్కొన్నారు.

## ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలు

**ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్**



తుపాను దృష్ట్యా ధాన్యం రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లా, మండల స్థాయి అధికారులు ప్రజలను, రైతులను అప్రమత్తంగా ఉండాలని ఉత్తర్వులు జారీ చేయడంతో వరి ధాన్యం రైతులు ఆందోళనకు గురై, తమ పండించిన ధాన్యం తడవకుండా ఉండేందుకు పట్టాలను కప్పి, అప్రమత్తమయ్యారు. ఎంటిఎంసి పరిధిలోని గుండి మెడ, చిరావూరు గ్రామాలలో సుమారు 500 ఎకరాలకు పైగా ధాన్యం పండించే రైతులు వరి సాగు చేస్తున్నారు. సోమవారం ఉదయం నుండి వాతావరణంలో మార్పు చోటు చేసుకోవడంతో కల్లాలలో ఉన్న ధాన్యం బస్తాలను, రోడ్డుపైకి చేర్చుకొని, ధాన్యం తడవకుండా ఉండేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బస్తాలలో ఉన్న ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా ఇళ్లకు చేర్చుకునేందుకు నిమగ్నమై ఉన్నారు. ఇప్పటివరకు వర్షం అధికంగా లేకున్నా మంగళవారం ఉదయానికి తుపాను ప్రభావం అధికంగా ఉంటుందని అధికారులు చెప్పడంతో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కష్టపడి పండించిన ధాన్యం తుపాను బారిన పడకముందే ప్రభుత్వ వ్యవసాయ అధికారులు ఆయా గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు త్వరగా ఏర్పాటు చేసి, కొనుగోలు చేయాలని కోరుతున్నారు.


చిర్రావూరు ధాన్యం రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి ఏ శ్రీనివాసులు, తదితరులు

## రైతులు అప్రమత్తంగా ఉండాలి

**తాడేపల్లి మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాసులు**

**ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్**

మిచౌంగ్ తుఫాను దృష్ట్యా రైతులు పంటలు కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తాడేపల్లి మండల వ్యవసాయ అధికారి ఆత్మకూరు శ్రీనివాసులు రైతులను అప్రమత్తం చేశారు. సోమవారం ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో వరి రైతులను కలిసి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు పలు సూచనలు చేసి, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచౌంగ్ తుపాన్ కారణంగా పొలాలలో నీరు నిలబడకుండా, డ్రైనేజీ వ్యవస్థ ద్వారా నీటిని బయటకు పంపి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలియజేశారు. పడిపోయిన వరి పొలాలలో విత్తనాలు మొలక రాకుండా ఉండటానికి ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. వరి పంట కోత కోసి బయటకు వచ్చిన ధాన్యాన్ని తడవకుండా టార్పాలిన్ పట్టాలు కప్పి, జాగ్రత్త చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మంగళగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, చిర్రావూరు ఆర్‌బికె అధికారిని శాంతి శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్

ప్రజాశక్తి-మాచర్ల

మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో మాచర్ల డివిజన్ పరిధిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం స్థానిక కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఇఇ జె హరిబాబు తెలిపారు. మిచాంగ్ తుపాను వలన వచ్చే గాలులకు గ్రామంలో, ప్రాంతంలో విద్యుత్ తీగలపై చెట్లు పడిపోవడం, విద్యుత్ తీగలు తెగి పడటం, విద్యుత్ స్తంభాలు పడిపోవడం, ట్రాన్స్ ఫార్మర్స్ వద్ద ఫీజులు పోవటం తదితర సమస్యలకు విద్యుత్ శాఖ మాచర్ల డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబరు 9440817531, టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోను చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలు కూడ ఆయా సందర్భాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇఇ సూచించారు.



## ప్రాథమిక పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని కాశి పాడు గ్రామంలోని ప్రాథ మిక పాఠశాల లో పెద కూరపాడు మండల విద్యా శాఖ అధికారి తాడిశెట్టి సత్య నారాయణ సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహించే రికార్డులు, ఇటీవల నిర్వహించిన పరీక్షల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని పరీక్షించారు. ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.



## బుకీలపై చట్టపరమైన చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - వినుకొండ

యువకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న క్రికెట్ బుకీలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిడిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కిరణ్‌కుమార్‌కు స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. పిడిఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వర రావు, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు ఆర్.ప్రసన్న కుమార్, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, బాధితుల సంఘం కన్వీనర్ సురభి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రికెట్ మాయలో పడి యువకులందరూ ఆస్తులు కోల్పోయి రోడ్డున పడుతున్నారని చెప్పారు. బుకీల ఒత్తిడితో రాష్ట్రవ్యాప్తంగా చాలామంది యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. 6 నెలల క్రితం స్థానిక హను మాన్ నగర్లో ఒక యువకుడు రూ.30 లక్షల వరకు బెట్టింగ్‌లో పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, ఇంకా అనేకమంది ఈ ప్రాంతంలో చనిపోయారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగును వినుకొండ ప్రాంతంలో అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామని, స్థానిక పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

# 'జగనన్నకు చెబుదాం'కు ఆర్థిక పరమైన ఫిర్యాదులు

- అర్జీల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించాలి
- పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశం



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించాలని సకాలంలో పరిష్కారం చూపాలని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగన్నన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం, ఆన్‌లైన్ ద్వారా నగదు అపహరణ, కుటుంబ, ఆర్థిక, ఆస్తి, పొలం, ఆర్థిక పరమైన మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందినట్లు చెప్పారు.'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి,నిర్ణీత గడువు లోగా సదరు ఫిర్యాదులను పరి ష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు కె.వి మహేష్, యు.రవిచంద్ర పాల్గొన్నారు.

### మిత్రుడు ఇబ్బందిపెడుతున్నాడు

చిలకలూరిపేట మండలం మానుకొండవారిపాలెం గ్రామానికి చెందిన కళ్ళం పేరిరెడ్డి తన స్నేహితునితో కలిసి వ్యాపార నిమిత్తం రూ.75 లక్షలు గుంటూరు సెం ట్రల్ బ్యాంకులో లోన్ తీసుకున్నామని, అయితే, ఆ లోన్ చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నాడని, ఈ విషయమై అడిగితే బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.

### ఎద్దుల డబ్బులివ్వట్లేదు

రెంటచింతల మండలం పాల్వాయిగేటు గ్రామానికి చెందిన మేడికొండ రంగారావు తన వద్ద ఉన్న రెండు ఎద్దులను గురజాల మండలానికి చెందిన రైతుకు విక్రయిస్తే మూడు నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వడం లేదని బాధితుడు ఫిర్యాదు చేశారు. రూ.60 వేలకు విక్రయించేందుకు బేరం కుదరిందని, రూ.500 బయానా చెల్లించి ఎద్దులను తీసుకెళ్లాడని, డబ్బులు ఇవ్వకపోగా బెదిరిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని రంగారావు కోరారు.

### రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బంది

సత్తెనపల్లి పట్టణానికి చెందిన ఒంటిపులి కొండలు ఒక వ్యక్తి దగ్గర పొలం కొనుగోలు చేసేందుకు రూ.10 లక్షలకు బేరం కుదుర్చుకుని రూ.50 వేలు అడ్వాన్స్ చెల్లించానని మిగిలిన నగదు తీసుకుని పొలం రిజిస్ట్రేషన్ చేయాలని అడుగుతున్నప్పటికి పొలం రిజిస్టర్ చేయడం లేదని, అడ్వాన్స్ తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఫిర్యాదు చేశారు.



ఘంటసాల చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శివశంకర్ తదితరులు

## ఘంటసాలకు ఘన నివాళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పాటల రూపంలో ఘంటసాల ఎప్పటికి జీవించే ఉంటారని జిల్లా కలెక్టర్ ఎల్. శివ శంకర్ అన్నారు. సోమవారం ప్రముఖ గాయకులు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా నరసరావుపేట పట్టణంలోని పల్నాడు బస్టాండ్ వద్ద గల పల్నాడు కళాక్షేత్రం లో ఏర్పాటు చేసిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఘంటసాల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు ఘంటసాల చేసిన కృషిని కొనియాడారు. తెలుగు, తమిళం, కన్నడ భాషలలో పలు పాటలు పాడారని గుర్తు చేశారు. కళాక్షేత్రం అధ్యక్షులు మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వర రెడ్డి మాట్లాడుతూ అగ్ర కథ నాయులకు గాత్ర దానం చేస్తూనే సాదాసీదా జీవితం గడిపారని నేటి గాయకులు ఎందరో ఘంటసాల శైలిని అవలంబిస్తున్నారన్నారు. కళాక్షేత్రం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## కొణిజేటి రోశయ్య ఆదర్శనీయుడు


ప్రజాశక్తి-మాచర్ల

మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యను ఆదర్శంగా తీసుకోని ఆయా రంగాల్లో రాణించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు సూచించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ రోశయ్య 3వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రోశయ్య ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా తదితర ఉన్నత పదవులలో రాణించి, ఆయా పదవులకు వన్నె తెచ్చారని, నేటి తరానికి ఆయన సేవలు ఆదర్శం కావాలన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘు అధ్యక్షులు కౌన్సిలర్ పోలా శ్రీనివాసరావు, కార్యదర్శి చిల్లంచర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ మార్కెట్ యజమానికి ఎమ్మెల్యే పరామర్శ

- నష్టపరిహారం అంచనా వేయాలి
- రెవిన్యూ అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



చరిష్మ సూపర్ మార్కెట్ యజమాని నాగేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

చిలకలూరిపేట రోడ్డులోని చరిష్మ సూపర్ మార్కెట్ లో అగ్నిప్రమాదం సంభవించిన నేపథ్యంలో సూపర్ మార్కెట్ యజమాని ఏలూరి నాగేశ్వరరావును ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి సోమవారం పరామర్శించారు. ఘటనపై ఎవరిపైన అయినా అనుమానం ఉంటే చెప్పాలని విచారణకు తన సహకారం అందిస్తానని చెప్పారు. తనకు ఎవరితో శత్రుత్వం లేదని ఎవరిపై కూడా అనుమానాలు లేవని నాగేశ్వరరావుకు ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టపరిహారం క్షేత్ర స్థాయిలో అంచనా వేయాలని ఘటనకు కారణంపై విచారణ జరిపి నిగ్గు తేల్చాలని తహశీల్దార్ రమణ నాయక్ ను ఆదేశించారు. వ్యాపార రంగంలో రాణిస్తున్న చరిష్మ సూపర్ మార్కెట్ కు ఇది కోలుకోలేని ఘటన అని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటన ను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని చెప్పారు.



## టిడిపి లీగల్ సెల్ కన్వీనర్ చలపతిరావుకు కన్నా పరామర్శ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

తెలుగుదేశం పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ ఎం వి చలపతిరావు నుసోమవారం సాయంత్రం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ పరామర్శించారు. చలపతిరావుకు ఇటీవల బైపాస్ సర్జరీ జరిగిన నేపథ్యంలో కన్నా ఆయన గృహానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట టిడిపి లీగల్ సేల్ నేతలు బాపయ్య చౌదరి,ఉల్లం శేషగిరిరావ, పూజల వెంకట కోటయ్య, అనుమోలు జయరాం, బొక్క సంగీతరావు,బత్తుల ఆదినారాయణ , దివ్వెల శ్రీనివాసరావు,నాయకులు నూర్ భాషా,జానీ బాబు , కంబాల వెంకటేశ్వరరావు, భాను ఉన్నారు. వడ్డవల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన తెలుగు రైతు పట్టణ అధ్యక్షుడు పీల సాంబశివరావు గృహానికి కూడా వెళ్లి కన్నా పరామర్శించారు.

# ఉద్యాన రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - తుళ్లూరు

తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. రాజధాని నిర్మాణం నుంచి మినహాయిం చడంతో పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. మెట్ట ప్రాంతమైన పెదపరిమి, వడ్డమానులో మిర్చి, పత్తి అధికంగా సాగవుతుండగా కృష్ణాతీర ప్రాంత గ్రామం హరిశంద్రపురంలో అరటి, వరి, కూరగాయలు పండిస్తున్నారు. రాజధాని నిర్మాణానికి లాండ్ పూ లింగ్ లో భూములు ఇవ్వని రైతులు కూడా పంటలు సాగు చేస్తున్నారు. మందడం, రాయపూడి, లింగాయ పాలెం, వెంకటపాలెం తదితర గ్రామాల రైతులు అరటి, జొన్న, ఉల్లి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తున్నారు. తుపాను కారణంగా పంటలకు నష్టం వాటిల్లుతుందేమోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పత్తి తీతలు ముమ్మరంగా సాగుతున్న ప్రస్తుత సమయంలో వర్షాల వల్ల పత్తి తడిచి నల్ల బారిపోవడం, పత్తి కాయల లోకి నీరు చేరి కుళ్ళి పోవడం వల్ల దిగుబడి పై తీవ్ర ప్రభావం పడుతుందని వాపోతున్నారు. ఎక్కువ రోజుల పాటు అధికంగా వర్షాలు కురిస్తే మిర్చికి కూడా నష్టమే నని రైతులు చెబుతున్నారు. వర్షంతో పాటు గాలుల తీవ్రత అధికంగా ఉంటే అరటి చెట్లు విరిగి పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


లింగాయపాలెంలో సాగవుతున్న అరటి

**అప్రమత్తంగా ఉండండి :** తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సోమవారం రాత్రి గ్రామాల్లో మైకు ప్రచారం నిర్వహించారు. కృష్ణానదీ తీర ప్రాంత గ్రామాలైన తాళ్లాయపాలెం, వెంకటపాలెం, బోరుపాలెం పెదలంక, రాయపూడి లంకలో నివాసం ఉండే వారు మరింత అప్రమత్తంగా ఉండాలంటూ రెవెన్యూ, పంచాయతీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



## సుబ్బారెడ్డికి మేయర్ సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక అమరావతి రోడ్డు, నగరాలులోని ఫర్నీచర్ షాప్ ప్రారంభోత్సవానికి హాజరైన వైసిపి సీనియర్ నాయకులు, ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలబొకేతో సన్మా నించారు.

## కేంద్రం నిర్లక్ష్యం వల్లే జల వివాదాలు

ప్రజాశక్తి-గుంటూరు

తెలుగు రాష్ట్రాల మధ్య వస్తున్న జల వివాదాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం పరిష్కరించాల్సిన కేంద్రం నిర్లక్ష్య ధోరణి వల్లనే రెండు రాష్ట్రాల మధ్య ఘర్షణలు తలెత్తుతున్నాయని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణా జలాలు, ప్రధానంగా సాగర్ ఆనకట్ట ద్వారా వెళ్లే నీటి కోసం జలజగడం తిరిగిప్రారంభమైందని, రైతుల ఆందోళన దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ పోలింగ్‌కు ముందురోజు రాత్రి హఠాత్తుగా సాగర్ ఆనకట్టపై దండయాత్ర చేసిందని పేర్కొన్నారు. మంచినీటి కోసం నీరు విడుదల చేశామని మంత్రి అంబటి రాంబాబు ప్రకటించినా ఇలా అర్ధరాత్రి వెళ్లిన పద్ధతికి అందరూ అభ్యంతరం చెబుతున్నారని అన్నారు. రెండు రాష్ట్రాల పెద్దలు కూర్చొని మాట్లాడుకోవాల్సిన సమస్యను బలవంతంగా నీటి విడుదల దాకా తీసుకెళ్లటం సరికాదన్నారు. నీటి ఎద్దడి వల్ల ఎపిలో తీవ్రమైన ఇబ్బందులున్నాయని, కావున కేంద్రం జోక్యం చేసుకొని సర్దుబాటు చేయాలని కోరారు.

## తాడేపల్లి లోతట్టు ప్రాంతాల ఇళ్లల్లోకి నీరు

ప్రజాశక్తి - తాడేపల్లి

తుపాన్ ప్రభావంతో తాడేపల్లి పట్టణంలో సోమవారం ఉదయం నుంచి ఓ మాదిరి నానుడు వర్షం పడుతూనే ఉంది. పట్టణంలోని రామయ్య కాలనీ, బోటుయార్డు, పుష్కర కాలనీ తదితర ప్రాంతాల్లో ఇళ్ల ముందుకు నీరు చేరింది. ఆ ప్రాంతమంతా చిత్తచిత్తడిగా మారింది. దోమలు స్వైరవిహారం చేయడంతో అంటురోగాలు ప్రబలుతాయోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తాడేపల్లి తహశీల్దార్ ఎం.నాగిరెడ్డి పరిస్థితిని సమీక్షించారు. సీతానగరం వైపు కృష్ణానదిలో హెచ్చర్కి బోర్డులు ఏర్పాటు చేశారు. నదిలోకి చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించారు. నదీ పరివాహక ప్రాంతంలో నివశిస్తున్న ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. వృద్ధులు, పిల్లలను బయటకు రానివ్వద్దని సూచించారు. గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎటువంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.



సీతానగరం వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

# బిఆర్ఎస్ ఓటమి స్వయంకృతాపరాధమే : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి-గుంటూరు

తెలంగాణాలో బిఆర్ఎస్ ఓటమి స్వయంకృతాపరాధమేనని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలపై అవగాహన ఆధ్వర్యంలో సోమవారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో న్యాయవాది అవధానుల హరి అధ్యక్షతన సభ నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కెసిఆర్ నియంతృత్వ వైఖరి, సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చకపోవటం, నిరుద్యోగుల దెబ్బ, అతి విశ్వాసం తదితర అంశాలపై వల్ల ఆపార్టీ ఓటమి పాలైందని, మరోవైపు ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లటంలో కాంగ్రెస్ జయప్రదం అయ్యిందన్నారు. కెసిఆర్ సిఎం అయ్యాక ప్రజలతో దగ్గరగా మెలగక పోవటం ఆయన పట్ల వ్యతిరేకత పెంచిందన్నారు. అంతేకాకుండా బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వ్యవహారశైలి తీవ్ర అసంతృప్తిని పెంచిందన్నారు. రైతు బంధు పథకాన్ని వ్యవసాయం చేయని భూస్వాములు వినియోగించుకున్నారని, కౌలు రైతులు తమ ఓటు ద్వారా నిరసన తెలిపారన్నారు. ఉద్యోగ నియామకాల్లో జాప్యం, పరీక్షా పత్రాల లీకేజి, గ్రూప్-1 పరీక్ష రెండుసార్లు రద్దు కావటం వంటి వాటితో యువతలో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, రేవంత్‌రెడ్డి అందర్నీ కలుపుకొని పోవటం ఆ పార్టీ విజయానికి దోహదపడిందన్నారు. మిగతా మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌పార్టీలోని నాయకుల ఏకపక్ష ధోరణి, అస్తవ్యస్థ విధానాలు, ఆ పార్టీ ఓటమికి కారణాలుగా చెప్పవచ్చన్నారు. కార్యక్రమంలో విశ్లేషకులు మహా దేవ్, ఇంజినీర్ సదాశివం, కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

## చలమయ్య కాలేజిలో ముగిసిన నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక సంగడి గుంటలోని చలమయ్య డిగ్రీ కాలేజిలో సాఫ్ట్ స్కిల్స్‌పై నిర్వహించిన శిక్షణా ముగిసింది. ఈ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి కళాశాల కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభు హాజరయ్యారు. ఈ సందర్గంగా ఆయన మాట్లాడుత ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవటానికి విద్యార్ధులకు ఇటువంటి శిక్షణా తరగతులు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. ప్రముఖ ఇంజినీరు నాగేశ్వరరావు మాడుతూ వేలాది రూపాయాలతో కూడుకున్న ఈ కోచింగ్‌ను మ్యాచింగ్ బస్ ఇండియా ఫౌండేషన్ ద్వారా ఉచితంగా ఇవ్వటం అభినందనీయమన్నారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గత 15 రోజులుగా విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్యూ స్కిల్స్, ఎంప్లాయిమెంట్ స్కిల్, మొదలైన వాటిపై అవగా హన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ తీసుకున్న విద్యార్థులతో కళాశాల కరస్పాండెంట్, తదితరులు

## 6న విజయవాడలో ఎంఆర్‌పిఎస్ రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి

ఎస్సీ వర్గీకరణే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి లక్ష్యమని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురు పాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. నగరంలోని ప్రెస్ క్లబ్ లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎనిమిదేళ్ళ క్రితం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వద్ద జరిగిన మాదిగల కురుక్షేత్ర మహాసభకు హాజరైన అనేకమంది ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలపై ఆనాటి ప్రభుత్వం కేసులు నమోదు చేసిందని గుర్తు చేశారు. ఇక నుంచి కోర్టుల చుట్టూ తిరుగుతూ అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా గత 30సంవత్సరాలుగా అనేక మంది ఎంఆర్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అమరులయ్యారని గుర్తు చేశారు. మాదిగ జాతి ఆత్మగౌరవాన్ని బిజెపి కాళ్ల వద్ద తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నేటికీ అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న మాదిగ జాతి ఏపీలో అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్లో జరిగిన సమావేశానికి మాదిగల విశ్వరూప సభ అని పేరు పెట్టారని, కానీ వాస్తవానికి అది బిజెపి ఎన్నికల ప్రచార సభ అని విమర్శించారు. ఆ సభలో ప్రధాని నరేంద్ర మోడీ సభ నిర్వహించిన నాయకుడిని పొగడమే సరిపోయిందని, ఎస్సీ వర్గీకరణ కోసం స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. ఈనెల ఆరవ తేదీన విజయవాడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి 30 ఏళ్ల ఎంఆర్పిఎస్ ఉద్యమంపై తగు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కో కన్వీనం ఏటుకూరి విజయ్ మాదిగ, కొదమల కుమార్ మాదిగ, మానికొండ శ్రీధర్ మాదిగ, పరసా రామయ్య మాదిగ, ఎంఆర్పీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు పొన్నికంటి రమేష్ మాదిగ, ఎంఆర్పీఎస్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొమురాల శ్రీనివాస్ మాదిగ పాల్గొన్నారు.




## విద్యుత్ శాఖ హెల్ప్‌లైన్ నంబర్లు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :మిచాంగ్ తుపాన్ కారణంగా తెనాలి డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు అత్య వసర సేవలు అందించేం దుకు ప్రత్యేక కాల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెనాలి ఏపీసీపీడీసీఎల్ తెనాలి ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి చిరంజీవి సోమవారం ఒకప్రకట నలో తెలిపారు. తుపాను కారణంగా ఏర్పడే ఈదురు గాలులకు విద్యుత్ లైన్లు తెగిపడిన, విద్యుత్ స్తంభాలు విరిగిన, క్రింద సూచించిన నంబర్లు ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు సంభవించిన, చెట్లు నేలకొరిగిన చెట్ల మధ్యన కరెంటు వైర్లను గుర్తించినట్లైతే ప్రజలు జాగ్రత్త వహించాలని తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ చేసేందుకు విద్యుత్ శాఖ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. **కాల్ సెంటర్ ఫోన్ నంబర్లు: తెనాలి: 9440817535, రేపల్లె: 9490615536, గంగిడిపాలెం: 9490615538, లంకవాని దిబ్బ 8500626842, భట్టిప్రోలు: 9490615539, కొల్లూరు: 9490615530**

## పొన్నూరులో టోల్‌ఫ్రీ నంబర్

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ : అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్రస్థాయిలో ప్రజలకు తుపాను గురించి హెచ్చరిక సందేశాలను తెలియజేయాలని పొన్నూరు మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం పొన్నూరు మండల తాసిల్దార్ కార్యాలయంలో మీచాంగ్ తుపాన్ గురించి అధికారులతో సమావేశం నిర్వహించారు ప్రజలకు అత్యవసర సహాయం కొరకు 9849904021 ఫోన్ నెంబర్ కు సంప్రదించవలసిందిగా కోరారు కార్యక్రమంలో టౌన్ ఎఇ వెంకయ్య, ఎడిఎ రామకోటేశ్వరి, ఎఇ వెంకటరామయ్య, ఎండిఓ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు




## మంగళగిరి టిడ్కో గృహాలకు తాగునీరు

ప్రజాశక్తి - మంగళగిరి

నారా లోకేష్ సహకారంతో టిడ్కో గృహాలకు సరఫరా చేసే తాగునీటి ట్యాంకర్ల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. మంగళగిరి టిడ్కో గృహ సమూదాయానికి తాగునీరు అందక స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సరఫరా ఎందుకు నిలిచిందో కూడా సరైన సమాధానం అధికారుల వద్ద నుండి లేదు. ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వెంటనే స్పందించారు. ఉదయం నుండి జోరు వర్షంలో సైతం జలధార పేరుతో మంచినీటి ట్యాంకర్లను పంపించి తాగునీటిని సరఫరా చేయిస్తున్నారు. మంచినీటి పునరుద్ధరణ జరిగే వరకు ట్యాంకర్ ల ద్వారా తాగునీటిని సరఫరా చేయడం జరుగుతుందని మంగళగిరి పట్టణ పార్టీ అధ్యక్షులు దామర్ల రాజు తెలియజేశారు.



## మంగళగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షునిగా కంతేటి

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా స్థానిక బాప్టిస్ట్ పేటకు చెందిన కంతేటి జీవన్ సాగర్ నియమితు లయ్యారు. గుంటూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు జీవన్ సాగర్‌ను పట్టణ అధ్యక్షునిగా నియమిస్తూ జారీచేసిన నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. జీవన్ సాగర్ ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కోఆర్డినేటర్‌గా కొనసాగు తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ సలీం, కాంగ్రెస్ పార్టీ జిల్లా కాపు సాధికారిక చైర్మన్ రేమినిశెట్టి హనుమంతరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొప్పాకుల కృష్ణారావు చౌదరి, నాయకులు గుడిపాటి అర్జునరావు పాల్గొన్నారు.

## నేడూ పాఠశాలలకు సెలవు

**ప్రజాశక్తి-గుంటూరు** :మిచౌంగ్ తుపాను కారణంగా రెండో రోజైన మంగళవారం కూడా జిల్లాలోని అన్ని రకాల యాజాన్యాల పాఠశాలలకూ విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. తుపాను తీవ్ర తగ్గని దృష్ట్యా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండోరోజూ సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రభుత్వ, ప్రైవేటు అన్ని రకాల మేనేజ్‌మెంట్ల పాఠశాలలు సెలవు ఇవ్వాలని ఆదేశించారు. ఏ పాఠశాల యాజమాన్యమైనా ఆదేశాలను ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

## సైనికుల కుటుంబాలకు సహకరించాలి

**ప్రజాశక్తి-గుంటూరు**

దేశ రక్షణకు నిరంతరం సేవలు అందించి యుద్ధంలో మరణించిన, పదవీ విరమణ పొందిన సాయుధ దళ సభ్యుల కుటుంబాల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ యమ్. వేణుగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కలక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆర్మ్డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డేకి సంబంధించిన పోస్టరును కార్ ఫ్లాగ్స్, పతాక స్టిక్కర్లను కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి ఆవిష్కరించారు. ఏటా డిసెంబర్ 7 న సాయుధ దళాల పతాక దినోత్సవం జరుపుకొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.గుణశీల, సిబ్బంది పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిరిధర్

## శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం

**ప్రజాశక్తి-గుంటూరు**

స్థానిక టిజెపియస్ కళాశాలలో సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ పాల్గొనడం వలన శారీరకంగా ఆరోగ్యంగా ఉండటమే కాకుండా, మానసికంగా దడంగా ఉంటారని చెప్పారు. అంతే కాకుండా ప్రతి క్రీడా కారుడికి ఇటువంటి పోటీలు ఎన్నో అవకాశాలను కలిపిస్తాయని, వీటిని ఉపయోగించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య దర్శకులు ప్రొఫెసర్. పి. జాన్సన్ మాట్లాడుతూ వ్యాయామ విద్య కి భారతదేశం పుట్టినిల్లని, ప్రపంచ దేశాలు మనల్ని చూసి వారి దేశాలలో వివిధ క్రీడలు ప్రవేశపెట్టారన్నారు. యువ క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌ని వినియోగించుకుని, యూనివర్సిటీ స్థాయిలో రాణించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడే విధంగా ఉండాలని పేర్కొన్నారు. ఇటువంటి పోటీలకు ఆతిథ్యం ఇచ్చినందుకు కళాశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. కళాశాల సెక్రటరీ కె. వి.బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థులను విద్యతో పాటు క్రీడలలో రాణించేలా తీర్చిదిద్ది, ఉపాధి అవకాశాలూ కల్పించటమే తమ కళాశాల లక్ష్యం అని, విద్యార్థులు క్రీడలలో రాణించం వలన స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు త్వరగా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వివిధ కళాశాలల నుండి విచ్చేసిన క్రీడాకారులు తమ కళాశాల పతాకంతో జాతీయ జెండాకు వందనం చేయడం, జాతీయ జెండాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ వి. కష్ణానంద్, ప్రిన్సిపాల్ ఎబిపి మనోహర్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అదారిటి అధికారి జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


## ప్రమాదకరమైన హోర్డింగ్స్‌ను తొలగించాలి : కమిషనర్

**ప్రజాశక్తి-గుంటూరు** :మిచౌంగ్ తుపాను గాలుల వలన హోర్డింగ్స్, ఇతర డిస్‌ప్లే బోర్డుల ప్రజలు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రమాదకరంగా ఉండే హెూర్డింగ్స్‌ని వెంటనే తొలిగించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమ వారం సిటీప్లానర్ ప్రదీప్ కుమార్ ఆయా హెూర్డింగ్స్, బోర్డ్ల యజమానులకు నోటీసులు జారీచేశారు. తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులు వేగంగా వీచే అవకాశం ఉన్నందున హోర్డింగ్స్ రోడ్ల మీద విరిగి పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, హోర్డింగ్స్ యజమాని తమ హోర్డింగ్స్ వలన ఏ సమస్య తలెత్తకుండా భాధ్యత తీసుకోవాలన్నారు. హోర్డింగ్స్, బోర్డుల వలన ఏ ప్రమాదం జరిగినా సదరు యజమానే పూర్తి భాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. టిపిఎస్‌లు తమ పరిధిలోని ప్రధాన సెంటర్లలోని హోర్డింగ్స్‌ని ప్రత్యక్షంగా పరిశీలించి, ఏమైనా సమస్య ఉంటే వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు కూడా తమ పరిధిలోవి పరిశీలించాలన్నారు. ముందస్తు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా ఉండే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తుపాను తీవ్రత దృష్ట్యా జిఎంసి గాంధీ పార్క్‌ని సోమవారం నుండి క్లోజ్ చేస్తున్నామని, ప్రభావం తగ్గిన తర్వాత పునప్రారంభిస్తామని కమిషనర్ తెలిపారు. అలాగే గుంట గ్రౌండ్‌లో కూడా ఎగ్జిబిషన్‌లకు తుపాన్ తగ్గే వరకు అనుమతులు ఇవ్వవద్దని అధికారులను ఆదేశించామన్నారు.

# తుపాను ప్రభావంతో అధికారులు అప్రమత్తం

- **పోలీస్, రెవెన్యూ శాఖల్లో హెల్ప్‌లైన్లు ఏర్పాటు**
- **వివరాలు వెల్లడించిన సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ**

**ప్రజాశక్తి-తెనాలి**



మిచౌంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అధికారులు అప్రమత్తమయ్యారని సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ చెప్పారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల ఆమె మాట్లాడుతూ తుపాను మంగళవారం బాపట్ల సమీపంలో తీరం దాటుతుందని చెప్పారు. ఫలితంగా తెనాలి డివిజన్ పరిధిలో భారీ వర్షాలు, 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ప్రతి మండల కేంద్రంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పునరావాస కేంద్రం అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పొన్నూరు, కొల్లిపర, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల మండలాలలో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. గాలులకు పూరిళ్ళు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. డివిజన్లోని తెనాలి, పొన్నూరు మున్సిపల్ కేంద్రాలలో అలాగే తాడేపల్లి- మంగళగిరి కార్పొరేషన్ పరిధిలో హోర్డింగులు గాలులకు పడిపోయే ప్రమాదం ఉన్న నేపధ్యంలో సంబంధిత అధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. అలాగే రోడ్ల వెంట చెట్లు కూలిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఫ్లయింగ్ టీం ను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీంలో ఆర్ అండ్ బి, పోలీస్, ఫైర్, రెవెన్యూ సిబ్బంది ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తారని, ఎప్పటికప్పుడు చెట్లను తొలగిస్తారన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వైద్య సేవలకు విఘాతం లేకుండా జిల్లా వైద్యశాల, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో జనరేటర్ లను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 450 మంది గర్భిణీలు ఈ వారంలో కాన్పుకు సిద్ధంగా ఉన్నారని, వారిలో తెనాలి డివిజన్ పరిధిలో సగం మంది ఉంటారన్నారు. వారిని ఐసిడిఎస్, అంగన్వాడి సిబ్బంది వైద్యశాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. వరి పంట కోతకు సిద్ధంగా ఉన్న నేపధ్యంలో రైతులు నష్టపోయే పరిస్థితి ఉందని, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది వారికి సహాయకారిగా ఉంటారన్నారు. తుపాను ప్రభావంతో పంట నష్టం అంచనాలను కూడా ప్రతిపాదిస్తామన్నారు. ఆర్ బి కేల ద్వారా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తుపాను ప్రభావిత ప్రాంతాలలో ప్రతి మండలానికి ఓ ప్రత్యేక అధికారిని నియమించామని, వారు మండల కేంద్రంలో అందుబాటులో ఉంటారన్నారు. విద్యాసంస్థల విషయానికి వస్తే సోమ వారం సెలవు ప్రకటించారని, శలవులు మరో రెండు రోజులు పొడిగించేం దుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. రెవె న్యూ శాఖకు సంబంధించి జిల్లాస్థాయిలో 86322 34012, పోలీస్ శాఖకు సంబంధించి 86888 31568 హెల్ప్ లైన్ సెంటర్లు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. అలాగే సబ్ కలెక్టర్ కార్యాలయంలోనూ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉందన్నారు. అధికారులు సూచించిన జాగ్రత్తలను ప్రజలు పాటించి సహకరించాలన్నారు.

# లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్

**ప్రజాశక్తి-గుంటూరు**



అవుట్‌ఫాల్ డ్రైన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

మిచౌంగ్ తుపాన్ తీవ్రత వలన జిఎంసి పరిధిలో ఎక్కడా ప్రాణ నష్టం కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. పీకలవాగు చుట్టుపక్కల, పురాతన భవనాల్లో నివాసం ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం కమిషనర్ జాతీయ రహదారి, పాత గుంటూరు, వేళాంగిణినగర్, ఏటుకూరురోడ్డు, బుడంపాడురోడ్డు, బాలాజీనగర్, నల్లచెరువు తదితర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలను, అవుట్‌ఫాల్ డ్రైన్‌లను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుపాను తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిఎంసి అధికారులు నగర పరిధిలో ఎక్కడా ప్రాణ నష్టం జరగ కుండా ప్రత్యేక శ్రద్ధతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా గతంలో జరిగిన ప్రాణనష్టం పునరావృతం కాకుండా పీకలవాగు చుట్టు పక్కల నివశించే ప్రజలు వర్షం వలన వాగు పొంగే ప్రమాదం ఉన్నందున వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలన్నారు. తప్పనిసరి పరిస్తితుల్లో మినహా ఇళ్ల నుండి బయటకు రావద్దని హితవు పలికారు. పురాతన భవనాల్లో నివాసం ఉండేవాళ్ళు కూడా వర్షాలు పెరిగితే గోడలు నాని కూలిపోయే అవకాశం ఉందని, తుపాను తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నగరంలో డబుల్ సెల్లార్‌తో నిర్మాణంలో ఉన్న భారీ భవనాల యజమానులు, పరిసర ప్రాంత ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా జిఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్(0863-2345103) ను సంప్రదించా లన్నారు. జిఎంసి ఉన్నతాధికారులతో తుపాను పర్యవేక్షణకు 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. తొలుత క్షేత్రస్థాయి పర్యటనలో పలు ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రైన్లలో మురుగు పారుదలకు పూడిక, వ్యర్థాల అడ్డంకి గమనించి అధి కారులపై ఆగ్రహం వ్యక్తంచేసి, అవుట్‌ఫాల్ డ్రైన్లలో యుద్ధప్రాతిపదికన పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించాలని ఇంజినీరింగ్, ప్రజా రోగ్యాధికారులను ఆదేశించారు. తొలగించిన పూడికతీత పనుల వివరాలను అందించాలని ఈఈలను ఆదేశించారు. వర్షాలకు డ్రైన్ల కల్వర్టుల వద్ద అడ్డంకులు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజరోగ్యాధికారులకు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని బెయిల్ అవుట్ చేయడానికి ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వ యంతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో ఎక్కడైనా చెట్టు కొమ్మలు విరిగితే వాటిని వెంటనే తొలగించడానికి పార్క్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడీ హెచ్‌ని ఆదేశించారు. త్రాగునీరు సరఫరా జరిగే రిజర్వాయర్లలో విద్యుత్ అంతరాయం కలిగినా సమస్యలు లేకుండా ముందస్తుగా జనరేటర్లని సిద్ధం చేసుకోవాలని ఏ.ఈ.లను ఆదేశించారు. తుపాను పరిస్థితుల దష్ట్యా సచివాలయాల వారీగా కార్యదర్శులు, అధికారులు అందుబాటులో ఉండాలని, వాలంటీర్ల ద్వారా ప్రజలకు తుఫాన్ తీవ్రతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్.ఈ సుందరరామిరెడ్డి, ఈఈ కొండారెడ్డి, ఏఈ సునీల్ కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్లు ఐజాక్, సునీత, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మహిళా డ్రోన్ ఆపరేటర్లకు ప్రోత్సాహం

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

వ్యవసాయ సాంకేతిక రంగంలో కోరమాండల్ కంపెనీ వినూత్నంగా డ్రోన్ టెక్నాలజీని అమలులోకి తీసుకువచ్చింది. లాం వ్యవసాయ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు జరుగుతున్న అగ్రి టెక్ ప్రదర్శనలో కోరమాండల్ కంపెనీ ఉపాధ్యక్షులు జి.వి.సుబ్బారెడ్డి సోమ వారం జరిగిన ప్రదర్శనలో మాట్లాడుతూ నానో ప్రాక్టికల్ టెక్నాలజీ , సుస్థిర వ్యవసాయం కోసం కృషి చేస్తున్నట్టు తెలిపారు. మహిళా డ్రోన్ పైలట్ల నైపుణ్యంతో ఆధునిక వ్యవసాయంలో నూతన మెళుకవులను అమలు చేస్తున్నట్టు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 110 మంది మహిళా డ్రోన్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చి వ్యవసాయం సాంకేతిక సలహాలను రైతులకు అందిస్తున్నట్టు తెలిపారు. మహిళా డ్రోన్ పైలట్లను ద్వారా నమునా ప్రదర్శనలో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పురుష ఆపరేటర్ల కన్నా మహిళా ఆపరేటర్లుకు ప్రోత్సహం అందిస్తున్నట్టు తెలిపారు. అగ్రి టెక్ ప్రదర్శనలో ఈ కంపెనీ ప్రతినిదులు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ఈప్రదర్శనలో




కోరమాండల్ కంపెనీ ఉత్పత్తులను పరిశీలించి నిర్వహాకులను అభినందించారు. కంపెనీ అధ్యక్షులు కె.ఎస్,.ఆర్.చక్రవర్తి, రీజనల్ హెడ్ ఎం.మోహనకుమార్, వ్యవసాయ శాస్త్ర వేత్త స్వరూప్, జోనల్ మేనేజర్ శ్రీహరి, వ్యవసాయ డిప్యూటీ డైరక్టర్ వి.గౌతమి తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.